చెప్పలేదనేగా యీ రభస. మధ్యాహ్నం నా వెంట రా. గార్డుగారింటికి తీసుకపోయి, అందరినీ పరిచయం చేస్తాను. ఆయనతోటి చెబుదువుగాని యిందాకచెప్పిన ఉపన్యాసమంతా!" శ్రీదేవి ముఖభంగిమచూస్తే నాకు నవ్వాగలేదు.

"బావా! తాగిన కాఫీ కాసిని నాతోటి పోట్లాడటంతో సరిపోయినాయి. ఇక వెళ్ళండి సార్ గారూ నాన్నగారొచ్చేటైమైంది."

శ్రీదేవి బుగ్గమీద చిటికేశాను.

చిరుకోపం నటించింది.

గిరుక్కున తిరిగి పంచలోకి వెళ్ళబోతుంటే అత్తయ్య కనబడ్డది.

అత్తయ్య చూసినట్టు అనుమానమేసింది.

చూస్తే చూడనీలే అనుకున్నాను.

---

స్కెచ్

# సంజీవయ్య సంధ్యాస్వప్నం

"పూ భా"

సంఘమూ, ప్రభుత్వమూ నిర్మించిన శాసనాల వల్ల ఎన్నో తీరనికోరికలూ, బయటకు వ్యక్తపరచరాని అభిప్రాయాలూ, ప్రతి మానవ హృదయంలో దాగి ఉంటాయి. వీటి ఫలసిద్ధికి వాస్తవికజగత్తులో అవకాశం లేదుకాబట్టి స్వప్నజగత్తు వీటి అనుభూతిని ప్రసాదిస్తుంది.

మకరసంక్రాంతి సాయంత్రాన్ని రాత్రి కౌగలించుకుంటోంది. ప్రజాసౌకర్యార్థం వెయ్యబడ్డ వీధి ఎలక్ట్రిక్ దీపం వెలిగింది. గదికిటికీదగ్గర మడత మంచంమీద పడుకున్న సంజీవయ్య ముఖంమీద కిటికీ గజాల సందుల్లోంచి వచ్చిన వీధిదీపం వెలుగు పడుతోంది.

వీధిలోంచి ఎన్నికల ప్రచారాల సంఘాలు ఓట్లకోసం నినాదాలు చేసుకుంటూ వెళ్ళిపోతున్నాయి.

"పలుతావుల్ వెదజల్లు తెమ్మెరలు పైపైడాయ, రేరాజు వెన్నెలకాయ..."

ఎప్పుడో ఎందుకోచదువుకున్న పద్యం జ్ఞాపకం వచ్చింది సంజీవయ్యకి.

లేచి బయలుదేరాడు.

పెద్దపార్కూ, రకరకాల చెట్లూ, వాటి పువ్వులూ, వాటి వాసనలూ—

మీదని చల్లని తెల్లని వెన్నెలా—

క్రిందని పరచిన రత్నకంబళిమల్లే మెత్తని పచ్చని గడ్డీ—

కూర్చుండికి అమర్చిన బెంచీలూ—

రంగురంగుల దీపాలకాంతితో జలయంత్రం కురిపిస్తూన్న యింద్రధనస్సు జలధారలూ—

వీటన్నింటినీ గడచి నడచిపోతున్నాడు సంజీవయ్య.

బీచికి వచ్చాడు. జనం కిటకిటలాడుతున్నారు. చోటుచూసుకుని సముద్రానికి ఎదురుగా ముఖం పెట్టి కూర్చున్నాడు. సముద్రతరంగాలు ఎగిరెగిరి విరిగి నురగలు కక్కుతున్నాయి.

"యూ కమ్ హియర్" అని వినిపించింది.

వెనక్కి తిరిగి చూసాడు.

ఎవరో వ్యక్తి—

"ఏం అలా గుడ్లు మిటకరించుకు చూస్తున్నావ్? నేనెవరో కనిపించలేదూ? సెల్యూటైనా చేసావు కావ్. ఎంతపొగరు!" అన్నాడు ఆ వ్యక్తి.

"ఎవరుమీరు? మర్యాదగా మాట్లాట్టం చాత కాదూ?"

"అంతవరకూ వచ్చింది! యిదుగో నీ పెర్సనల్ రికార్డు. యిప్పుడైనా తెల్సిందా నేనెవరో? నీ ప్రాణాలు నా చేతిలోఉన్నాయి."

"అయితే నువ్వు యముడివన్నమాట"

"నోర్ముయ్"

"ఎందుకు ముయ్యాలి?"

"నేను నీ అధికారిని. నువ్వు నా బానిసవు. నే నేమన్నా నువ్వు పడాల్సిందే"

"అదా సంగతి! ఆ లెక్కకొస్తే నేనేకాదు నువ్వుకూడా బానిసవే. నీకూ నాకూ ఒక్కసంఘే

డబ్బుయిస్తోంది. నీ అదృష్టంవల్ల నీకు శ్రమ తక్కువ అయినా ప్రతిఫలం ఎక్కువ ముడుతోంది. నా దురదృష్టంవల్ల శ్రమ ఎక్కువా ప్రతిఫలం తక్కువా అవుతోంది. నీకు నేను బానిసను ఎలా అయ్యానో నాకు తెలియటంలేదు. నీ కష్టార్జితం నాకేం ధారపొయ్యలేదులే మహా."

"నీ పొగరు అణుస్తానుండు."

"జాగ్రత్తగా మాట్లాడు. ఏం వెళిపోతున్నావ్... నీ యింటి పనులూ, స్వంత పనులూ, అరవచాకిరీ చేస్తూ తైరుకొట్టుకునీ, యిచ్చకాలు చెప్పుకుని తిరిగినవాళ్లు మంచివాళ్లన్నూ, ఆత్మగౌరవం గలవాళ్లు చెడ్డవాళ్ళున్నూ. హుఁ"

* * *

"నమస్కారం సంజీవయ్యగారూ!"

"ఎవరు నాయనా మీరు, నాలో ఏం గొప్పదనముందని నమస్కారంచేస్తున్నారు?"

"ఇప్పుడు నా దృష్టిలో అందరూ గొప్పవాళ్ళే."

"అయితే మీరు ఎలక్షనులో నిలబడుతున్నారా?"

"మేధస్సు అంటే అది. యిట్టే గ్రహించా సారు."

"కాని ఏంలాభం!"

"అంటే?"

"అంటేనా. నాకు వోటింగ్ హక్కు వుందో లేదో కూడా నాకు తెలియదు."

"చిత్రంగా మాట్లాడుతున్నారే."

"అవునులెండి. మా బ్రతుకే విచిత్రం."

"మీకు వోటు లేకపోవడమేమిటి?"

"ఆరునెల్లకోసారి బదిలీ అవుతూ వూరూరా తిరుగుతున్నాను నేను. నా పేరు ఏవూరి లిస్టులో వుందో, అసలు లేనేలేదో నాకు తెలియదు."

"ఓటింగు మీ జన్మహక్కు. ఆ హక్కును మీరు పోగొట్టుకోకూడదు."

"నేనెవరి హక్కో మీకు తెలుసా అసలు— ఇప్పుడే ఒక దురహంకారి నేను తన బానిసనని చెప్పుకుంటూ వెళుతున్నాడు."

"మీఓటింగు హక్కు మీరు సంపాదించుకోవటం మీ విధి."

"నాకు ఒకవేళ ఓటు వున్నా వెయ్యను."

"పోనీ నాకు వెయ్యవద్దు. ఎవరికి వెయ్యాలని ఉంటే వాళ్ళకే వెయ్యండి."

"ఎవరికీ వెయ్యను. అందువల్ల ఆత్మసంతృప్తి అయినా వుంటుంది."

"ఏం అలా అనేశారు?"

"ఏమిటి లాభం చెప్పండి. మా యిబ్బందులు ఆలోచించేవారు ఒకరైనా ఉంటేకదూ?"

"మీకేం కావాలో చెప్పండి."

"మీరు నన్ను ఒదిలేటట్టులేరే. ఇన్స్యూరెన్సు ఏజంటుకన్నా రెండాకులు ఎక్కువ చదువుకున్నారు మీరు. సరే రండి నాతో మాయింటికి."

* * *

"ఇదేనేమిటి మీ యిల్లు, కిల్లీకొట్టు బట్టీమల్లే ఉంది."

"దీంట్లోనే పదిమందికి వంటా, తిండీ,పడకాను. పాతికరూపాయలు అద్దె. యింకా చూడండి."

"ఇంట్లో యేమీ ఉన్నట్టు కనుపించలేదే— అందరూ చింకిగుడ్డలు కట్టుకున్నారేమిటి?"

"కడుపునిండా అసలు తిండికి ఉంటేగా?"

"మీ పెద్దవాడు ఏం చదువుతున్నాడు?"

"జీతం కట్టలేక చదువు మానిపించాం."

"మీకు పైపైని అప్పుడప్పుడు ముడుతుందని అంటారు?"

"ఇప్పుడది మావరకూ రాలేదులెండి."

"మీ వోటు నాకు అక్కర్లేదు మహాప్రభూ! నాకు సెలవు ఇప్పించండి."

"అయితే మీ ఉద్దేశంలో కూడా మేము మనుషులం కాముయంత్రాలమనేనా! మాకు స్వేచ్ఛా, విరామమూ అవసరం లేదనేనా... యిదుగో వెళ్ళిపోకండి..."

"ముసురుకునే మునిమాపువేళ ముసుగువేసుకుని ఏమిటండీ యీ పలవరింతలు" అంటూ శ్రీమతి తట్టి లేపింది.

త్రుళ్ళిపడి లేచి కూర్చుని "ఎందుకు లేపావ్ శ్రీమతీ! నేను చెప్పవలసింది చాలా ఉండిపోయింది" అన్నాడు సంజీవయ్య ఆవలించి, చిటికెవేసి, మెటికె విరిచి.

"చాల్లెండి. ఎవరైనా వింటే నవ్విపోతారు" అంది శ్రీమతి. ★